

### పాలిటెక్నిక్‌ ప్రవేశాలకు వేళాయె

పాలిటెక్నిక్‌ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 28 వరకు కౌన్సెలింగ్‌ ప్రక్రియ నిర్వహిస్తారు. -8లో



### 30 లక్షల మంది తల్లులకు కోత

తల్లికి వందనం పథకంలో 30 లక్షల మంది తల్లులకు కోత విధించారని ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. -8లో

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6/25.4

జిల్లాలో సోమవారం 25.4 – 34.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్‌

# సమష్టి కృషితో పార్టీ బలోపేతం



వైఎస్సార్‌సీపీ జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

- వైఎస్సార్‌సీపీ నిర్మాణంపై ఎనలేని శ్రద్ధ
- కార్యకర్తల కష్టాలు మా భుజాలపై వేసుకొని పరిష్కరిస్తాం
- పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశంలో కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి

**కడప కార్పొరేషన్‌:** ఒక నాయకుడు కార్యకర్తల కోసం నిలబడితే ఎలా ఉంటుందో.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలనలో చూస్తారని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్‌ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక రామాంజనేయపురంలోని మేడా కన్వెన్షన్‌ సెంటర్‌లో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం పట్ల అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని శ్రద్ధ కనబరుస్తున్నారని, గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టంగా తయారు చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారని గుర్తు చేశారు. కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా నలిగిపోయారని, భరించలేని అవమానాలు పొందారన్నారు. 15 ఏళ్ల విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కేడర్‌ను భయపెట్టడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. కార్యకర్తలు ఓర్పు, సహనంతో దేన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలు, కార్యకర్తలు రెండు కళ్లుగా వైఎస్సార్‌సీపీ పాలన ఉంటుందని, అవమానాలు పొందిన కార్యకర్తల కష్టాలు తమ భుజాన వేసుకొని పరిష్కరిస్తామని తెలిపారు.



- కమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త నరేన్‌ రామాంజులరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఉద్యమాల వల్లే ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం అమలు చేసిందన్నారు. మన పార్టీ తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదన్న సంకేతాలను ప్రజల్లోకి పంపాలన్నారు. అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదన్న సత్యాన్ని కూటమి నేతలు గుర్తెరగాలని హెచ్చరించారు.



- జెడ్పీ చైర్మన్‌ రామగోవింద రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు బిల్లులు రాక చాలా మంది నష్టపోయారని, వారికి వడ్డీతో సహా చెల్లిస్తామనే భరోసాను కల్పించాలని కోరారు. మొదటగా పార్టీ నేతలు దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి, సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు మాజీ చైర్మన్‌ పులి సునీల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

### మన సామర్థ్యాన్ని నమ్ముకోవాలి



ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు బలహీనతలను నమ్ముకోవడం సరికాదు. మన సామర్థ్యాన్ని నమ్ముకోవాలి. పార్టీ నాయకులు బాధ్యత ఎరిగి ప్రవర్తించడానికి ఇది సదవకాశం. – రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

### మోసం చేయడమే చంద్రబాబు పని



అబద్ధాలతో ప్రజలను మోసం చేయగలనని బాబు మరోసారి నిరూపించారు. అన్ని జిల్లాకంటే ముందుగా వైఎస్సార్‌ జిల్లా కమిటీలు వేసి కార్యవర్గ సమావేశం నిర్వహించింది. – ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ

### అంకిత భావంతో పని చేయాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలను పట్టించుకోలేదన్న అపవాదు ఉందని, ఇది పునరావృతం కాకుండా చూస్తాం. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా అంకిత భావంతో పని చేయాలి. –ఎస్‌బీ అంజద్‌బాషా, మాజీ ఉప ముఖ్యమంత్రి

### నెగిటివ్‌ ప్రచారం వల్లే ఓడిపోయాం



గత ఎన్నికల్లో నెగిటివ్‌ ప్రచారం వల్లే మనం ఓడిపోయాం. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల్లో ఉన్న అసంతృప్తి కూడా ఇందుకు ఒక కారణం. ప్రతిచోటా పార్టీ పట్ల పాజిటివ్‌ దృక్పథంతోనే మాట్లాడాలి. – డాక్టర్‌ దాసరి సుధ, బద్వేల్‌ ఎమ్మెల్యే

### వైఎస్సార్‌సీపీ పథకాలను కాపి కొట్టి..



వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీ కొట్టి కూటమి పాలన సాగుతోంది. ఎన్ని విభేదాలు ఉన్నా పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలి. ఏ పార్టీకైనా సిద్ధాంతాలు ఎంత ముఖ్యమో, అధినేతపై నమ్మకం, విశ్వాసం అంతే ముఖ్యం. – పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ

### పథకాల్లో నాయకుల భాగస్వామ్యం ఉండాలి



గత ప్రభుత్వంలో పథకాలను పార్టీ నేతల ద్వారా చేరవేయలేకపోయాం. ఈసారి నాయకుల భాగస్వామ్యంతో పథకాలు అమలు పరచాలి. ప్రతి నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు కేటాయించి పార్టీ కార్యకర్తలను బలోపేతం చేయాలి. – డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

### ఉద్యోగులకు డీఏలు, పీఆర్‌సీ ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక్క డీఏగానీ, పీఆర్‌సీగానీ ఇవ్వలేదు. వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యలపై మనం పోరాడాలి. – ఎంవీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

### సైనికుల్లా పని చేయాలి



రాబోయే నాలుగేళ్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలి. ప్రతి నెలా నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించాలి. మూడు నెలలకోసారి జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహించుకోవాలి. కార్యకర్తలు, నాయకులే పార్టీకి పట్టుగొమ్మలు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం, బలోపేతంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి. 2019–24లో కార్యకర్తల అంచనాలకు అందుకోలేకపోయాం. గత తప్పిదాలను సరిదిద్దుకుంటూ 2.0 సరికొత్తగా, అద్భుతంగా ఉంటుంది. అన్ని కమిటీలు పార్టీకి పునాది లాంటివి. – పి. రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

### ప్రజలను సంఘటితం చేయాలి



2019 ఎన్నికల్లో ఎలా పని చేశామో కార్యకర్తలంతా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇటుక, ఇటుక పేర్చుకుంటూ పార్టీ నిర్మాణం చేయాలి. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నట్లు.. మన సొంత గ్రామం నుంచే పార్టీని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలి. – కె.అజయ్‌రెడ్డి, కడప పార్లమెంటు పరిశీలకులు

### బ్లూ బుక్‌లో రాసుకోండి



వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించే అధికారులు, టీడీపీ నాయకుల పేర్లను బ్లూ బుక్‌లో రాసుకోవాలి. చంద్రబాబు అబద్ధాల వల్లే వైఎస్సార్‌సీపీ ఓడిపోయింది. కూటమికి ఓటేసి ఎంత పొరపాటు చేశామని ప్రజలు నేడు బాధపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు ఆర్థికంగా చితికిపోయారు. – ఎస్‌.రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌

## న్యూస్‌రీల్‌

### నేడు పులివెందులలో జాబ్‌మేళా

**కడప కోటిరెడ్డిసర్కిల్‌:** జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు పులివెందులలోని ఔటర్‌ రింగ్‌రోడ్డులో నగిరిగుట్ట వద్ద గల న్యాక్‌ భవనంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో ట్రైనీ, వెంకటసాయి ఎంటర్‌ప్రైజెస్‌ ప్రైవేటు లిమిటెడ్‌లో సేల్స్‌ ఎగ్జిక్యూటివ్‌, ఎల్‌ఐసీ ఆఫ్‌ ఇండియాలో బీమాసఖి, ఆడెసీ బై ఛానల్‌ ప్లే లిమిటెడ్‌లో అసెంబ్లీ ఆపరేటర్‌, ఆల్‌ డిక్సన్‌ కంపెనీలో అసెంబుల్‌ ఆపరేటర్స్‌, యంగ్‌ ఇండియాలో మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్‌, షిర్డిసాయి ఎలక్ట్రికల్స్‌ లిమిటెడ్‌లో ట్రైనీ ఆపరేటర్‌, అపోలో ఫార్మసీలో రీటైల్‌ ట్రైనీ అసోసియేట్‌ అండ్‌ ఫార్మసిస్టు, శ్రీరామ్‌ లైఫ్‌ ఇన్స్యూరెన్స్‌ బ్రాంచ్‌ డెవలప్‌మెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌, ఐటీఐ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, డిగ్రీ కలిగి 18–35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ.15–20 వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'



వ్యవసాయ అధికారి చంద్రానాయక్‌

**కడప అగ్రికల్చర్‌:** జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి క్షేత్ర స్థాయిలో 'పొలం పిలుస్తోంది' ప్రారంభమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్‌ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆయన సోమవారం వెల్లడించారు. ప్రతి వారంలో మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఉదయం ఒక గ్రామంలో, సాయంత్రం ఒక గ్రామం చొప్పున క్షేత్రస్థాయిలో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు రైతులతో కలిసి పంటలను పరిశీలించి తదుపరి గ్రామ ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామసభ ఏర్పాటు చేస్తారన్నారు. రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేస్తారన్నారు. రైతులకు సాగు వ్యయం తగ్గించడం, మెరుగైన పద్ధతులు అవలంబించడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఉత్పాదకత పెంచడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

# ఇత్తడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

**కలెక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌**

**మైదుకూరు:** మండల పరిధి వనిపెంటలోని ఇత్తడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వనిపెంటలోని ఇత్తడి కళాకారుల వర్క్‌షాప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌ నిర్వాహకుడు ఇస్మాయిల్‌ కళాకారులు తయారు చేసిన ఇత్తడి కళాకృతులను కలెక్టర్‌కు చూపించి కళాకారుల సాధక బాధకాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌, ఆర్డీఓ చంద్రమోహన్‌, తహసీల్దార్‌ రాజసింహ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**నవోదయ విద్యాలయం స్థల పరిశీలన**

**బ్రహ్మంగారిమఠం:** బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందని కలెక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ తెలిపారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలసి కలెక్టర్‌ మల్లేపల్లె పంచాయతీ ఎద్దులాయపల్లె దగ్గర నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ విద్యాలయానికి ఎంపిక చేసిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. తోట్లపల్లె వద్ద ఉన్న గురుకుల పాఠశాల, బి.మఠం శ్మశాన వాటికను పరిశీలించారు. మఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఫిట్‌పర్సన్‌ శంకర్‌బాలాజీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బద్వేల్‌ ఆర్డీఓ చంద్రమోహన్‌, ఇన్‌చార్జి తహసీల్దార్‌ రాజసింహనరేంద్ర, డీటీ జాన్స్‌, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహగౌడు, రాజానాయుడు, నాయకులు ఎస్సార్‌ శ్రీనివాసులరెడ్డి, పోలిరెడ్డి, సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**కడప సెవెన్‌రోడ్స్‌:** గండికోట లోయ వద్ద ఈ నెల 18 తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్‌ శ్రీధర్‌ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌ పీజీఆర్‌ఎస్‌ హాలులో అర్జీలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగాంధ్ర– 2025 మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించే యోగాంధ్రా కార్యక్రమానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు జూన్‌ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర కార్యక్రమానికి ఎనిమిది లక్షల మంది రిజిస్ట్రేషన్‌ చేసుకున్నట్లు తెలిపారు. జూన్‌ 20వ తేదీ వరకు సమయం ఉన్నందున రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# సారూ.. సమస్యలు తీర్చరూ..



కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులకు సమస్యలు తెలుపుతున్న ప్రజలు

**కడప సెవెన్‌రోడ్స్‌:** సారూ.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టర్‌ కార్యాలయంలోని సభా భవనంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వారు వినతిపత్రాలు సమర్పించారు. కలెక్టర్‌ డాక్టర్‌ శ్రీధర్‌ చెరుకూరితోపాటు జిల్లా అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాంతంలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇక్కడికి వచ్చామని, మీరైనా కష్టాలు తీర్చాలని కోరారు. వారిలోని కొందరి సమస్యలు ఇలా ఉన్నాయి.

- భూ రీ సర్వే అనంతరం కొత్తగా 1బీ అడంగల్‌లో ఇనాం అనే పేరు చేర్చడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె గ్రామానికి చెందిన రైతు జాగృతి సంఘం అధ్యక్షుడు జి.మనోసాగర్‌రెడ్డి తెలిపారు. అందువల్ల రైతులు భూమిని అమ్ముకోలేకపోతున్నారని, ఒకవేళ కొనేందుకు ఎవరైనా వచ్చినా తక్కువ రేటుకు అడుగుతున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఆర్‌లో ఇనాం అని ఉండటం వల్ల 1బీ అడంగల్‌లో ఇనాం పొందుపరిచినట్లు సర్వేయర్‌ అంటున్నారని తెలిపారు.
- మైదుకూరులో నాఫెడ్‌ సంస్థకు, ఉల్లి పరిశోధన కేంద్రం ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్‌లకు భూమిని కేటాయించాలని బీపీ వెంకట ప్రతాప్‌రెడ్డి కోరారు. జనవరి 18న ముఖ్యమంత్రి చంద్రబాబు మైదుకూరు పర్యటనకు వచ్చినపుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని పేర్కొన్నారు. జలవనరుల శాఖ భూమి ఉల్లి పరిశోధన కేంద్రానికి, నాఫెడ్‌ సంస్థ భూమి వాణిజ్య అవసరాల కోసం తిరిగి ఆ సంస్థకే కేటాయించాలని కోరారు.
- తమ గ్రామ సర్వే నంబరు 158లో 3.26 ఎకరాల భూమి తాను 1986లో కొనుగోలు చేశానని జమ్మలమడుగు మండలం పి.సిరిగేపల్లె గ్రామానికి చెందిన ఎస్‌.గుర్రప్ప తెలిపారు. అయితే చిన్నదండ్లూరు గ్రామానికి చెందిన మాచనూరు వీరారెడ్డి అనే రైతు ఆ భూమి తనకు వచ్చిందంటూ సరిహద్దు రాళ్లు పీకేసి సుమారు ఎకరా భూమిని ఆక్రమించారని ఆరోపించారు.

**అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ**

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్‌ సి.శ్రీధర్‌తోపాటు జిల్లా అధికారులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్‌ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్‌డీసీ వెంకటపతి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనాలు

- సజావుగా సాగని రిజిస్ట్రేషన్‌లు
- స్లాట్‌ బుకింగ్‌తో ఆటంకాలు
- సతాయిస్తున్న సర్వర్‌ సమస్య
- క్రయవిక్రయదారులకు ఇక్కట్లు
- ప్రభుత్వ తీరుపై అసహనం



కడపలోని డిస్ట్రిక్ట్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం



కడపలోని రూరల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో ప్రజల రద్దీ

**కడప కోటిరెడ్డిసర్కిల్‌:** ప్రభుత్వానికి రోజూ రిజిస్ట్రేషన్‌ ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. అయితే కూటమి సర్కార్‌ రోజుకొక కొత్త నిబంధన తీసుకు వస్తుండటంతో రిజిస్ట్రేషన్లు సజావుగా సాగకపోగా, వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. అలాగే రిజిస్ట్రేషన్‌ చేయించుకునేందుకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం 2.0 విధానం తీసుకొచ్చింది. దాని తర్వాత స్లాట్‌ బుకింగ్‌ విధానాన్ని తీసుకు రావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తొలుత సర్వర్‌ సరిగా పనిచేయక రిజిస్ట్రేషన్‌కు తరచూ ఆటంకాలు కలుగుతుండటంతో.. క్రయ విక్రయదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు సర్వర్‌ సమస్య, మరోవైపు ఇంటర్నెట్‌ సరిగా పని చేయకపోవడంతో గంటల కొద్దీ ప్రజలు రిజిస్ట్రేషన్‌ కార్యాలయం వద్దనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.

**జిల్లాలో 12 సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు**

కడపలో ప్రధాన అర్బన్‌ కార్యాలయంతోపాటు రూరల్‌ కార్యాలయం ఉంది. వీటితోపాటు బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, ముద్దనూరు, ఎర్రగుంట్ల, వేంపల్లె, కమలాపురం, సిద్దవటం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాలు ఉన్నాయి. కడప, ప్రొద్దుటూరులో నిత్యం క్రయ విక్రయదారుల రద్దీ అధికంగా ఉంటుంది. మొదట కడప అర్బన్‌ కార్యాలయంలో స్లాట్‌ బుకింగ్‌ విధానాన్ని అమలు చేశారు. ఆ తర్వాత జిల్లాలోని మిగిలిన అన్ని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో స్లాట్‌ బుకింగ్‌ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. తమ రిజిస్ట్రేషన్‌ కోసం తొలుత స్లాట్‌ బుక్‌ చేసుకుని ఆ సమయానికి.. కచ్చితంగా రిజిస్ట్రేషన్‌ కార్యాలయానికి చేరుకోవాలి. ఆ సమయానికి వెళ్లకపోతే తిరిగి స్లాట్‌ బుక్‌ చేసుకోవాల్సి వస్తోంది. ఈ కారణంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు ఒకరిద్దరు ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్నారు. వైఎస్‌ జగన్‌ సర్కార్‌ హయాంలో రోజుకు ఒక్కొక్క కార్యాలయంలో 100కు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, ప్రస్తుతం స్లాట్‌ విధానం అమలులోకి వచ్చిన తర్వాత 39 రిజిస్ట్రేషన్లు మాత్రమే చేసుకోవాల్సి వస్తోంది. ఈ కారణంగా ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండి పడుతోంది.

**ఆధార్‌, పాన్‌ కార్డు తప్పనిసరి**

ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్రయ విక్రయదారులు ఇరువురు ఆధార్‌, పాన్‌కార్డులను కలిగి ఉండాలి. అంతేకాకుండా ఆయా కార్డుల్లో జన్మదిన తేదీ ఉంటేనే రిజిస్ట్రేషన్‌ చేసుకునే అవకాశం ఉంది. కొంత మంది క్రయ విక్రయదారులకు పాన్‌కార్డు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లకు అనేక ఆటంకాలు కలుగుతున్నాయి. ఏ దస్తావేజుకైనా కక్షిదారులు తప్పనిసరిగా పాన్‌కార్డు ఉంటేనే.. రిజిస్ట్రేషన్‌ చేసేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వానికి ప్రతి రోజు కోట్లాది రూపాయలు ఆదాయం వచ్చే శాఖపైనే సంబంధిత అధికారులు ఆంక్షలు విధిస్తుండటంతో ప్రజలు మండిపడుతున్నారు. పాన్‌ కార్డు తప్పనిసరి కావడం వల్ల అమ్మకం, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**కూటమి వచ్చాక కష్టాలు అధికం**



రిజిస్ట్రేషన్‌ శాఖకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ వచ్చాక కష్టాలు అధికమయ్యాయి. క్రయ విక్రయదారులకు పాన్‌కార్డు ఉండాలన్న నిబంధనలతో తీవ్ర సమస్యగా మారింది. అలాగే శ్లాట్‌ బుకింగ్‌ విధానంతో కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

– డేనియల్‌, కడప

### ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి



ఫిర్యాదుదారుల అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌

**కడప అర్బన్‌:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్‌ కార్యాలయంలోని పెన్నార్‌ పోలీస్‌ కాన్ఫరెన్స్‌ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్‌ గ్రీవెన్స్‌ రిడ్రెస్సల్‌ సిస్టం ) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌ కరీం, మహిళా పీఎస్‌ డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్రవేశాలకు వేళాయే!

- ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 21 నుంచి కౌన్సెలింగ్.. సర్టిఫికెట్ల పరిశీలన
- 25వ తేదీ నుంచి ఆప్షన్ల ఎంపిక.. జులై 3న సీట్లు కేటాయింపు
- జిల్లాలో పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు 6840 మంది అర్హులు

సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్ ఇలా..

| తేదీ | ర్యాంకు నుంచి | ర్యాంకు వరకు |
|---|---|---|
| 21.06.25 | 1 | 15000 |
| 22.06.25 | 15001 | 32000 |
| 23.06.25 | 32001 | 50000 |
| 24.06.25 | 50001 | 68000 |
| 25.06.25 | 68001 | 86000 |
| 26.06.25 | 86001 | 104000 |
| 26.06.25 | 104001 | 120000 |
| 28.06.25 | 120001 | చివరి ర్యాంకు |


కడపలో హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

కడప ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 30న నిర్వహించిన పాలిసెట్–2025లో జిల్లా వ్యాప్తంగా 6840 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 3942 మంది బాలురు కాగా 2918 మంది బాలికలు ఉన్నారు. వీరికి ర్యాంకుల వారీగా ఇచ్చిన తేదీల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లు నిర్వహించే కౌన్సెలింగ్‌లో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. ఇందు కోసం కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం దగ్గరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు విద్యార్థులు వెళ్లి ఆప్షన్స్ ఉచితంగా ఎంపిక చేసుకోవచ్చు. షెడ్యూల్ మేరకు తమ ర్యాంకును బట్టి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. అనంతరం వారికి ఇచ్చిన తేదీ ప్రకారం ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందాలి.

**ఫీజు వివరాలు ఇలా..**

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే ఓసీ, బీసీలు రూ. 700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చొప్పున ఆన్‌లైన్ విధానంలో ప్రాసెస్ ఫీజు చెల్లించాలి. ఫీజు చెల్లించిన రసీదు, పాలిటెక్నిక్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. స్టడీ సర్టిఫికెట్ లేని వారు ఏడేళ్ల రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యుఎస్ వర్తించే వారు అర్హత ధ్రువపత్రం అందజేయాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాన్‌లోకల్ విద్యార్థులు మైగ్రేషన్ సర్టిఫికెట్, పిడబ్ల్యూడీ, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, మైనార్టీ, ఆంగ్లో ఇండియన్ వంటి ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారు అర్హత ధ్రువీకరణ పత్రాలను కౌన్సెలింగ్ సమయంలో అందజేయాలి. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.

**కోర్సుల వివరాలు..**

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్, మెకానికల్, సివిల్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) మెటలార్జికల్ ఇంజినీర్(ఎంఈటీ) తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, వేంపల్లి, సింహాద్రిపురం, జమ్మలమడుగు, మైదుకూరులలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పరిధిలో దాదాపు 3800 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కడపలో ప్రత్యేకంగా మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఉంది. ఈ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు.

ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కేటగిరి వారికి..

| తేదీ | కేటగిరి | ర్యాంకులు |
|---|---|---|
| 25.06.25 | ఎన్‌సీసీ | 1 నుంచి 40000 |
| | పిడబ్ల్యూడీ | 1 నుంచి చివరి ర్యాంకు |
| 26.06.25 | స్పోర్ట్స్ అండ్ గేమ్స్ | 1 నుంచి 60000 |
| | ఎన్‌సీసీ | 40001 నుంచి 80000 |
| 27.06.25 | ఎన్‌సీసీ అండ్ గేమ్స్ | 60001 నుంచి చివరి ర్యాంకు |
| | ఎన్‌సీసీ | 80001 నుంచి చివరి ర్యాంకు |
| 28.06.25 | సీఏపీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, అండ్ ఆంగ్లో - ఇండియన్ | 1 నుంచి చివరి ర్యాంకు |

ఆప్షన్ల ఎంపిక తేదీలు ఇలా..

| తేదీలు | ర్యాంకులు |
|---|---|
| 25, 26 | 1- 50000 |
| 27, 28 | 50001- 90000 |
| 29, 30 | 900001- చివరి ర్యాంకు వరకు |

జులై 1న ఆప్షన్ల మార్పునకు అవకాశం

జులై 3న సీట్ల కేటాయింపు

**షెడ్యూల్ ప్రకారం నిర్వహణ..**

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి షెడ్యూల్ ప్రకారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలి. ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది.

– సీహెచ్ జ్యోతి, పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప



## క్లుప్తంగా

### విద్యుత్ షాక్‌తో రైతు మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు బొందెల రాంబాబు


తండ్రి మరణంతో విషాదంలో చిన్నారులు

దువ్వూరు : మండలంలోని ఐ.బయనపల్లె గ్రామంలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఐ.బయనపల్లె గ్రామానికి చెందిన బొందెల రాంబాబు (37) పొలం కౌలుకు తీసుకుని పూల పంటను సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం పొలానికి నీరు కట్టాలని మోటార్‌ను ఆన్ చేయడానికి స్టార్టర్ స్విచ్ ఆన్ చేయగా విద్యుత్ షాక్‌తో రాంబాబు అక్కడికక్కడే పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి నంద్యాల జిల్లా చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రాధా, అర్షిత్ (8), అభిరామ్ (7) అనే ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

### డిష్ కేబుల్ మెడకు తగిలి.. వాహనదారుడికి తీవ్ర గాయాలు


గాయపడిన హరికృష్ణ

అట్లూరు : డిష్ కేబుల్ మెడకు తగిలి ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన అట్లూరు మండలం అయ్యప్పస్వామి ఆలయం వద్ద జరిగింది. స్థానికులు, బాధితుని వివరాల మేరకు కొండూరు బీసీ కాలనీకి చెందిన కోడికాళ్ల హరికృష్ణ తన ఇద్దరు కుమారులను ద్విచక్ర వాహనంపై అట్లూరు క్రాస్ రోడ్డుకు తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి గుడి దగ్గరకు వచ్చే సరికి విద్యుత్తు స్తంభాలపై వేలాడుతున్న డిష్ కేబుల్ హరికృష్ణ మెడకు తగిలి చుట్టుకుంది. దీంతో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అతని కుమారులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన హరికృష్ణను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

### నగరపాలక సర్వసభ్య సమావేశానికి భద్రత కల్పించండి

జేసీ, ఎస్పీలకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల వినతి


జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో ఈనెల 20వ తేదీ నిర్వహించే సర్వసభ్య సమావేశానికి తగిన భద్రత కల్పించాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కోరారు. సోమవారం వారు జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జరిగి సర్వసభ్య సమావేశాల్లో బయటి వ్యక్తులు సభలోకి రావడంతో సభలో గందరగోళం ఏర్పడిందన్నారు. మేయర్, కార్పొరేటర్లు ఆమోదించిన ఎజెండాను కమిషనర్ తాను వినలేదు అని చెప్పి సెక్రటరీ వద్ద ఉన్న మినిట్స్ పుస్తకాన్ని కమిషనర్ తెప్పించుకొని ఆయనవద్దే ఉంచుకొని నెలరోజులపాటు తీర్మానాలను ఆమోదించలేదన్నారు. అప్పటి నుంచి కౌన్సిల్ హాలుకు తాళాలు వేశారని, హాలును తెరవాలని మేయర్, కార్పొరేటర్లు కలిసి రాతమూలకంగా తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఈనెల 20న సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో అందులో వసతుల కల్పనకు ఈనెల 18వ తేదీ కౌన్సిల్ హాలు తెరిచేందుకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే మాధవి కార్పొరేషన్‌కు సంబంధం లేని వ్యక్తులతో సభలోకి ప్రవేశించడాన్ని నిరోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, కె. బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, శివకోటిరెడ్డి, షంషీర్, జహీర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు జమాల్‌వలీ, ఎస్ఎండీ రిజ్వాన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## వన్డే క్రికెట్ టోర్నీలో కడప, చిత్తూరు జట్ల విజయం


5 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ ధనుష్‌రెడ్డి


50 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మెన్ వరుణ్


90 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ రోహిత్ వర్మ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ –19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి. సోమవారం కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 4 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 21.4 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి కేవలం 81 పరుగులు చేసింది. చిత్తూరు జట్టులో ధనుష్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు , సాయి శరణ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 82 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 15.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ 50 పరుగులు చేశాడు.

**వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..**

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 10 వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.4 ఓవర్లకు అన్ని వికెట్లు కోల్పోయి130 పరుగులు చేసింది. జట్టులోని వీరారెడ్డి 25 పరుగులు చేశాడు. కడప బౌలర్ నాగ కుళ్లాయప్ప 3 వికెట్లు తీశాడు. అనంతరం 131 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 15.1 ఓవర్లలో ఒక వికెట్ కూడా కోల్పోకుండా 132 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 90 పరుగులు చేశాడు.

## 30 లక్షల మంది తల్లులకు కోత

- పోలీసులను అడ్డం పెట్టుకొని కూటమి పాలన
- అప్పులు చేస్తున్నా.. పథకాలు అమలు చేయడం లేదు
- శాంతి భద్రతలను గాలికొదిలేశారు
- 'జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


పుస్తకావిష్కరణ చేస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : తల్లికి వందనం పథకంలో 30 లక్షల మంది తల్లులకు కోత విధించారని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక మేడా కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, పార్లమెంటు పరిశీలకులు కె. అజయ్‌రెడ్డి, పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఎస్. రఘురామిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, పి. రామసుబ్బారెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, కమలాపురం సమన్వయ కర్త నరేన్ రామాంజులరెడ్డి, మాజీ సలహాదారు ఇ. తిరుపాల్‌రెడ్డిలతో కలిసి 'జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఏ రకంగా అమలు చేయాలని వైఎస్ జగన్ ఆలోచిస్తే, ఏ రకంగా తుంగలో తొక్కాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని పరిపాలన సాగిస్తున్నారని, ఎల్లో మీడియా తప్పా మరే మీడియా ఉండకూడదన్న ఉద్దేశం కనబడుతోందన్నారు. వైఎస్ జగన్ పొదిలి పర్యటనలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు వేస్తే, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైనే తిరిగి కేసులు పెట్టారన్నారు. వారిని అసాంఘిక శక్తులుగా చిత్రీకరిస్తున్నారని, ఈ ఘోరాలు, నేరాలు, తప్పులను చూపకుండా మీడియాపై ఆంక్షలు విధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో దొంగతనాలు, జూదం, మట్కా, అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా సాగుతోందని, శాంతిభద్రతలను గాలికొదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించడంలో పోలీసులు బిజీగా ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లలో రూ.3.30లక్షల కోట్ల అప్పులు చేయగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికే రూ.1.58లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. అంత అప్పు చేసి కూడా పథకాలు అమలు చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు.

**చొక్కాలు పట్టుకోవడం కాదు.. ఊడదీస్తారు: రవీంద్రనాథ్‌రెడ్డి**

అన్నీ లెక్కలు వేసుకున్నాం.. సూపర్ సిక్స్ పథకాలతో పాటు అన్ని సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేస్తాం...అలా చేయకపోతే చొక్కా పట్టుకొని నిలదీయాలని చంద్రబాబు, లోకేష్ ఎన్నికల్లో చెప్పారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజలు వారి చొక్కాలు ఊడదీయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఉద్యమిస్తేనే తల్లికి వందనం అమలు చేశారని, అందులోనూ సగం మందికి కోత కోశారన్నారు. నాలుగున్నర లక్షల మందికి పింఛన్లు ఎగ్గొట్టారన్నారు. సుపరిపాలన–స్వర్ణాంధ్రప్రదేశ్ అంటూ కేకులు కట్ చేయడం విచిత్రంగా ఉందన్నారు. అమరావతి పేరుతో రూ.53వేల కోట్లు అప్పులు చేశారన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కోసమే టెండర్లు పిలిచారన్నారు. వివిధ పథకాలు అమలు చేయకుండా ఈ ప్రభుత్వం రూ.83వేల కోట్లు ప్రజలకు ఎగనామం పెట్టిందన్నారు.

### ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించారు

కడప రూరల్ : ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని, మోసగించిన మహిళపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడపకు చెందిన అహ్మద్, ప్రవల్లిక, మాధవరం వాసి మోహన్ మాట్లాడుతూ ఒక సంఘానికి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్న మహిళ హోం గార్డ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ 3 లక్షలకు పైగా 20 మంది వద్ద డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు.

## అటవీ స్థలం ఆక్రమణదారులకు నోటీసులు


అటవీశాఖ అధికారులు జారీ చేసిన నోటీసు-3

ప్రొద్దుటూరు క్రైం : రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో నివాసం ఉంటున్న వారికి సోమవారం అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రొద్దుటూరు ఎఫ్ఆర్ఓ హేమాంజలి ఆధ్వర్యంలో అటవీ, రెవెన్యూ అధికారులు కలిసి 3వ నోటీసును అందజేశారు. కొన్ని రోజుల క్రితం వీరికి రెండు నోటీసులను అందజేసిన విషయం తెలిసిందే. నోటీసులు ముట్టిన 15 రోజుల్లోపు సంజాయిషీ, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను అటవీశాఖ అధికారులకు చూపించాల్సి ఉంది. అయితే మొదటి రెండు నోటీసులకు ఆక్రమణదారులు ఎలాంటి డాక్యుమెంట్లను చూపించలేదని అధికారులు చెబుతున్నారు.


**ఇదే చివరి నోటీసు..**

రామేశ్వరం రిజర్వు ఫారెస్ట్ స్థలంలో పెద్ద ఎత్తున ఇళ్లు వెలిశాయి. చాలా ఏళ్ల నుంచి ఇక్కడ ఇళ్లను నిర్మించుకొని వందలాది కుటుంబాలు నివాసాలు ఉంటున్నాయి. కొన్ని ఇళ్లైతే రెండు, మూడు చేతులు కూడా మారాయి. అటవీస్థలం పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైందని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణంలోని ఒక న్యాయవాది లోకాయుక్తకు వెళ్లారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు అటవీ స్థలాన్ని ఖాళీ చేయించేందుకు ప్రొద్దుటూరు అటవీ అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే అటవీ–రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ప్రొద్దుటూరు రేంజ్ పరిధిలో సుమారు 1044 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు అధికారిక గెజిట్‌లో ఉంది. ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తి, ప్రొద్దుటూరు రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండాల్సిన అటవీ భూమిలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సర్వే అనంతరం 825 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. మిగతా 219 ఎకరాలు ఏమైందనేది తేలాల్సి ఉంది. జాయింట్ సర్వే రిపోర్టు తుది నివేదికను అధికారులు నేడో, రేపో కోర్టుకు సమర్పించనున్నారు. కాగా సోమవారం నుంచి 3వ నోటీసును అందించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నోటీసు జారీ పూర్తి కానున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఇదే చివరి నోటీసు అని, నోటీసు అందిన 15 రోజుల్లోగా అటవీ స్థలంలో ఇళ్లను నిర్మించుకున్న వారు సంజాయిషీతో పాటు తగు డాక్యుమెంట్లను చూపించకుంటే స్థలాన్ని ఖాళీ చేయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**35 ఏళ్లుగా నివాసాలు**

బైపాస్‌రోడ్డులోని ముక్తియార్ ఆయిల్ మిల్లు వెనుక భాగంలో ఉన్న రామేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో సుమారు 254 ఇళ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ 35 ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్నారు. ఈ ప్రాంతంలో పోలింగ్‌బూత్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉన్నట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఇంటికి డోర్ నంబర్, విద్యుత్ మీటర్ ఉందని, కుళాయి పన్ను కూడా కడుతున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఎలా ఖాళీ చేస్తామని వారు చెబుతున్నారు.

### తల్లికి వందనం కార్మికులందరికీ వర్తింపజేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనంతోపాటు ఇతర సంక్షేమ పథకాలను ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఆప్కాస్, అంగన్వాడీ, మున్సిపల్, స్కీమ్ వర్కర్లందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయని సీఐటీయూ కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య అన్నారు. తాము అధికారంలోకి వస్తే రూ. 25 వేల కంటే తక్కువ వేతనం తీసుకుంటున్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక హామీలు విస్మరించడం దారుణమని విమర్శించారు. అంగన్వాడీ ఆయాకు రూ. 7 వేలు, టీచర్‌కు రూ. 11,500 మాత్రమే వేతనం ఇస్తున్నారని, వీరికి సంక్షేమ పథకాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి, వరలక్ష్మి, భాగ్యమ్మ, సావిత్రి, విజయ తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ఇద్దరు పాత కేసుల్లో నిందితులు


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

మైదుకూరు : మైదుకూరులో శనివారం రాత్రి టిప్పర్ చోరీకి గురైన సంఘటనలో సోమవారం మైదుకూరు అర్బన్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ సోమవారం సాయంత్రం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నెపల్లె గ్రామంలో నివాసం ఉంటున్న కాశినాయన మండలం రెడ్డికొట్టాలు గ్రామానికి చెందిన దేశిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి కొంత కాలంగా మైదుకూరు మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన చాగంరెడ్డి సాంబశివారెడ్డికి చెందిన టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇవ్వాల్సిన జీతం సాంబశివారెడ్డి రూ.29వేలు బకాయి పడ్డాడు. బకాయి సొమ్ము అడిగినా ఇవ్వడం లేదనే కోపంతో డ్రైవర్ ఈశ్వర్‌రెడ్డి తన స్నేహితులైన బ్రహ్మంగారిమఠం మండలం కేవశవాపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి ఓబుళరెడ్డి, రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామానికి చెందిన పోరెడ్డి రామసుబ్బారెడ్డి అనే వారితో కలిసి శనివారం రాత్రి స్థానిక వనిపెంట రోడ్డులో జగన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద పార్కు చేసి ఉన్న సాంబశివారెడ్డికి చెందిన రూ.10లక్షల విలువైన టిప్పర్‌ను దొంగలించుకెళ్లారు. టిప్పర్‌ను విక్రయించి వచ్చిన సొమ్మును ముగ్గురు సమానంగా పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. టిప్పర్‌ను గుంటూరుకు తీసుకెళ్లి విడిభాగాలుగా చేసి విక్రయించాలని పథకం వేసుకున్నారు. అంతవరకు టిప్పర్‌ను ఖాజీపేట మండలం నాగసానిపల్లె వద్ద కంపచెట్లలో దాచి పెట్టారు. తనకున్న ఇంకొక టిప్పర్ కేశలింగాయపల్లె వద్ద ఉండగా అక్కడికి వెళ్లి వచ్చేసరికి చోరీకి గురికావడంపై యజమాని చాగంరెడ్డి సాంబశివారెడ్డి ఆదివారం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిప్పర్‌కున్న జీపీఎస్ పరికరాన్ని దుండగులు తొలగించడంతో అర్బన్ పోలీసులు దుండగుల కోసం గాలిస్తూ నిఘా ఉంచారు. సోమవారం డ్రైవర్ ఈశ్వర్‌రెడ్డి, అతని స్నేహితులు కలిసి టిప్పర్‌ను విక్రయించేందుకు గుంటూరుకు తీసుకుని వెళుతుండగా మధ్యాహ్నం 2 గంటల సమయంలో మైదుకూరు – బద్వేలు రోడ్డులో ఉన్న తువ్వపల్లె కూడలి వద్ద అరెస్టు చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుల్లో దేశిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి గతంలో రెండు హత్యకేసుల్లో, 5 మోటారు బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని.. వేమిరెడ్డి ఓబుళరెడ్డి ఒక ఎర్రచందనం కేసు, ట్రాక్టర్ చోరీ, రెండు మోటార్ బైక్‌ల చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. టిప్పర్ చోరీపై ఫిర్యాదు అందిన వెంటనే నిఘా ఉంచి నిందితులను పట్టుకున్న అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సిబ్బందికి రివార్డులను అందజేశారు. విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి, ఎస్ఐ ఎస్.సుబ్బారావు, ఏఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : అటవీశాఖ పరిధిలోని కేవీ బావి బీటులో ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు